ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 15 మే 2024






నియోజకవర్గాల్లో పోలింగ్ ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
ఎచ్చెర్ల	2,44,760	2,03,831	83.27
నరసన్నపేట	2,14,866	1,77,145	82.44
ఆమదాలవలస	1,93,858	1,57,848	81.42
టెక్కలి	2,36,327	1,90,272	80.51
పలాస	2,19,348	1,67,632	76.42
పాతపట్నం	2,25,313	1,63,044	72.36
ఇచ్ఛాపురం	2,68,202	1,89,238	70.55
శ్రీకాకుళం	2,73,260	1,91,875	70.21

గుంభనంగా వైసీపీ..

ధీమాతో కూటమి



- గెలుపోటములపై ఎవరికి వారే అంచనాలు
- అభ్యర్థులు విజయంపై జోరుగా పందేలు
- జిల్లాలో పోలింగ్ 76.80 శాతం
- ఎచ్చెర్లలో అత్యధికం.. శ్రీకాకుళం అత్యల్పం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. పోలింగ్ 76.80శాతం నమోదైంది. జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో సోమవారం అర్ధరాత్రి వరకూ పోలింగ్ కొనసాగింది. ఈ దఫా మహిళా ఓటర్లు భారీగా తరలివచ్చారు. జిల్లాలో 18,75,934 మంది ఓటర్లు ఉన్నారు. ఓటేసినవారు 14,40,885 మంది. పురుష ఓటర్లు 9,29,859 ఉండగా.. 7,01,016 మంది ఓటువేశారు. వీరి పోలింగ్ 75.39 శాతం నమోదైంది. మహిళా ఓటర్లు 9,45,945 ఉండగా.. 7,39,852 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరి ఓటింగ్ శాతం 77.21 శాతంగా ఉంది. ట్రాన్స్‌జెండర్స్ 130 మంది ఉండగా 17 మందే ఓటు వేశారు. ఎచ్చెర్ల అసెంబ్లీలో అత్యధికంగా 83.27 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళంలో 70.21 శాతంతో అత్యల్పంగా పోలింగ్ జరిగింది. తెలుగుదేశం, జనసే, బీజేపీ కూటమిగా ఏర్పడి ఈ దఫా ఎన్నికల్లో పోటీచేసింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు, ఒక పార్లమెంట్ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థులు, ఎచ్చెర్లలో బీజేపీ అభ్యర్థి పోటీచేశారు. పోలింగ్ జరిగాక.. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో 19 రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

శ్రీకాకుళం..

ధర్మాన ప్రసాదరావు 2019లో కేవలం 5777 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జనసేన అభ్యర్థికి 7,557, బీజేపీకి 1,340 ఓట్లు లభించాయి. ఇప్పుడు జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా టీడీపీకి మద్దతు ఇచ్చాయి. టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ రెండేళ్ల నుంచి సొంతంగా అన్నక్యాంటీన్ నిర్వహించడం.. విభిన్నరీతిలో టీడీపీ కార్యక్రమాలు చేసుకుంటూపోవడం.. ప్రజలకు దగ్గరవడంతో విజయం తిరుగులేదన్న సంకేతాలు పాకిపోయాయి.

ఆమదాలవలస..

2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం 13,991 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఐదేళ్లలో అభివృద్ధి చేయకపోవడం, వైసీపీలో నాలుగు వర్గాలుగా విడిపోవడం, పలు ఆరోపణలు సీతారాంను చుట్టుముట్టడం.. ముఖ్యంగా శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పూర్తిచేయించలేకపోవడంతో ప్రజలు వైసీపీపై విసిగిపోయారు. ఇక్కడ టీడీపీ చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజలు కూన రవికుమార్ వైపు మొగ్గుచూపారన్న సర్వే నివేదికలు వెల్లడవుతున్నాయి. ఈ దఫా మెజార్టీ భారీగా ఉంటుందని కూన రవి అంచనా వేసుకుంటున్నారు.

ఎచ్చెర్ల..

గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ 18,711 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ దఫా బీజేపీ నుంచి నడుకుదిటి ఈశ్వరరావు పోటీచేశారు. ఐదేళ్లలో వైసీపీ హత్యారాజకీయాలు.. కిడ్నాప్‌లు.. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం వల్ల ఎన్నికల్లో గంపగుత్తుగా బీజేపీ అభ్యర్థి ఈశ్వరరావు వెంట జనం నడిచారన్న అభిప్రాయం ఉంది. ఇక్కడ అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ బీజేపీ గెలుపు ఖాయమని, కూటమి అధికారంలోకి వస్తే మంత్రి పదవి వరించవచ్చని చర్చ ఉంది. పోలింగ్ రోజే ఎమ్మెల్యే కిరణ్‌ను ఓటర్లు ప్రశ్నించి.. గ్రామాలను ఏం అభివృద్ధి చేశావంటూ నిలదీశారు. దీంతో వైసీపీలో గెలుపు ధీమా కనిపించడం లేదు.

టెక్కలి..

ఇక్కడ వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కావడంతో తెలుగుదేశం అభ్యర్థి, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గెలుపు మరోమారు ఖాయమని వైసీపీ నాయకులే అంచనాకు వచ్చేశారు. అచ్చెన్నకు హ్యాట్రిక్‌గా భారీ మెజార్టీ లభిస్తుందని పక్కాలెక్కలు వేసుకుంటున్నారు. అన్నిగ్రామాల కార్యకర్తలు, సాధారణ ప్రజలు సైతం అచ్చెన్నాయుడు వద్దకు వచ్చిమరీ చెబుతున్నారు. టెక్కలిలో ప్రజల తీర్పు ఏకపక్షమే అని, ఇంతకు మించి విశ్లేషణ కూడా ఉండదని ప్రజల భావన.

నరసన్నపేట..

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌కు గత ఎన్నికల్లో 19,555 ఓట్ల మెజార్టీ లభించింది. ఇప్పుడు ఎంతమేర ఓట్లతేడాతో ఓటమిపాలవుతారా? అన్నది టీడీపీ నాయకులు అంచనా వేస్తున్నారు. సొంతపార్టీలో అసంతృప్తి.. హామీలే తప్ప అమలుచేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో ఓటు రూపంలో వైసీపీపై బదులు తీర్చుకున్నారని సమాచారం. టీడీపీ కేడర్ ఆనందంగా ఉంది.

పాతపట్నం

టీడీపీకి విపరీతమైన ప్రజాబలం ఉన్న నియోజకవర్గం ఇది. వైసీపీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడు జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీచేస్తే.. ప్రజలు టీడీపీ అభ్యర్థిని గెలిపించారు. రాష్ట్రంలో టీడీపీకి దక్కిన ఏకైక జడ్పీటీసీ ఇదే. అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా మామిడి గోవిందరావుకు టీడీపీ అవకాశం కల్పించింది. మొదట్లో కాస్తంత గందరగోళమున్నా.... ఆయనకు ప్రజాబలం లభించింది. పైగా వైసీపీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై ఉన్న అసమ్మతి వర్గమంతా టీడీపీలో చేరి గట్టిగా పనిచేశారు. ఇక్కడ తమ విజయం ఖాయమని టీడీపీవర్గాలు చెబుతున్నాయి.

ఇచ్ఛాపురం..

టీడీపీ కంచుకోటగా ఉండే నియోజకవర్గం ఇచ్ఛాపురం. ఇక్కడ నుంచి పోటీచేసి రెండు దఫాలు గెలిచిన బెందాళం అశోక్ మరోసారి హ్యాట్రిక్‌కు సిద్ధంగా ఉన్నారన్న ధీమా కనిపిస్తోంది. వైసీపీ నుంచి ఎంతటి బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపినా.. ప్రముఖులు ప్రచారం నిర్వహించినా.. ప్రజల మద్దతు టీడీపీకే అనేరీతిలో పరిస్థితి ఉంది.

పలాస..

వైసీపీ నుంచి సీదిరి అప్పలరాజు 2019 ఎన్నికల్లో గెలుపొందారు. ఐదేళ్లలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌ను విమర్శించేందుకు ఇచ్చిన ప్రాధాన్యం.. నియోజకవర్గంలో వైసీపీ కేడర్‌ను కాపాడుకునేందుకు ఇవ్వలేదు. దీంతో ఆయన ముఖ్యఅనుచర వర్గమంతా టీడీపీకి జై కొట్టేశారు. సొంత మండలంలో కూడా అప్పలరాజుకు పోలింగ్ రోజున నిలదీతలు ఎదురయ్యాయి. టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ఐదేళ్లు పోరాడటంతో ప్రజలు ఆమెవైపే నిలిచారన్నది టీడీపీ వర్గాల ధీమా.

వైసీపీ నాయకులు.. పైకి గుంభనంగా..

పదిరోజుల క్రితం వరకు వైసీపీ అభ్యర్థుల్లో ఉన్న ఉత్సాహం.. ఇప్పుడు కనిపించడం లేదు. ప్రతి అభ్యర్థి పైకి గుంభనంగా ఉన్నా అంచనాలు తారుమారవుతాయని భయాందోళన చెందుతున్నారు. నవరత్నాలు మినహా.. అభివృద్ధి చేపట్టలేదన్న భావన వారిలో ఉంది. ఇవేవీ బయటకు కనిపించనీయకుండా.. ఓటుకు నోట్లు పంపిణీ చేశారు. సర్వేలు ఎన్డీఏ కూటమికే అనుకూలంగా ఉండటంతో ఓటర్లు కూడా ఆలోచించి నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ అభ్యర్థుల ఓటమిపైనా.. టీడీపీ అభ్యర్థుల గెలుపు.. మెజార్టీపైనా అప్పుడే బెట్టింగ్‌లు మొదలయ్యాయి.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త రామారావు

టీడీపీకి ఓటేస్తావా?

- హరిపురంలో టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుడి దాడి

హరిపురం, మే 14: మందస మండలం హరిపురానికి చెందిన టీడీపీ కార్యకర్త, ఎలక్ట్రికల్ మెకానిక్ కనగల రామారావుపై వైసీపీ నాయకుడు కర్ర అనిల్ దాడి చేశాడు. రామారావు సోమవారం తన తల్లిని ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తుండగా వైసీపీ శ్రేణులతో వివాదం నెలకొంది. ఇరుపార్టీల నాయకులు సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. మంగళవారం ఉదయం వైసీపీ నాయకుడు అనిల్.. మెకానిక్ షాపు వద్దకు వచ్చి రామారావుతో వాగ్వాదానికి దిగాడు. వైసీపీకి ఓటు వేయకుండా టీడీపీకి వేస్తావా.. నీకు ఎంత ధైర్యం? అంటూ రామారావు ముఖం, ఛాతిపై పిడిగుద్దులు గుద్దాడు. మరికొంతమంది వైసీపీ నాయకులు కూడా దాడి చేయడంతో రామారావు సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు ఆయన్ని హరిపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో బాధితుడ్ని గౌతు శిరీష పరామర్శించారు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు ఇలా దాడులకు పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యలు పునావృతమైతే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైసీపీ నాయకుడు వద్ద కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్ కొంతమంది ప్రొద్బలంతోనే దాడికి దిగినట్లు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ అనిల్‌కుమార్‌ను కోరారు.

పోలింగ్ తర్వాతా.. అరాచకాలే

- జిల్లాలో కొనసాగుతున్న వైసీపీ ఆగడాలు
- అర్ధరాత్రి దాటాక టీడీపీ బూత్ ఏజెంట్లపై దాడి
- వలస ఓటరు ఇంటికి తాళం వేసి బెదిరింపు

పలాస/కాశీబుగ్గ, మే 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా.. వైసీపీ శ్రేణుల అరాచకాలు ఆగడం లేదు. టీడీపీ శ్రేణులు, మద్దతుదారులపై అర్ధరాత్రి వేళ దాడులకు పాల్పడుతూ.. భయాందోళన సృష్టిస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి చిన్నబడాంలో టీడీపీ పోలింగ్ ఏజెంటు శ్రీనివాసరావు, ఆయన కుమారుడు సాయిచరణ్‌పై స్థానిక వైసీపీ నాయకులు సోమవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులు పోలీసులకు ఫోన్ చేసినా వారు ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా రాలేకపోయారు. దీంతో వైసీపీ నాయకులు మరింత రెచ్చిపోయి వీరంగం సృష్టించారు. క్షతగాత్రులను తీసుకెళ్లేందుకు 108 అంబులెన్స్ సిబ్బంది రాగా.. వైసీపీ మూకల దాడికి భయపడి బాధితులు ఇంటినుంచి బయటకు రాలేకపోయారు. విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష.. అర్ధరాత్రి సమయంలో వారిని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం కాశీబుగ్గ డీఎస్పీకి పరిస్థితి వివరించడంతో.. ఆ ప్రాంతంలో పోలీసు పహారా ఏర్పాటు చేశారు.



చిన్నబడాంలో మన్మథరావు ఇంటికి వైసీపీ నేతలు వేసిన తాళం



బాధితుడు అప్పలస్వామిని పరామర్శిస్తున్న గౌతు శిరీష

- విజయనగరంలో కౌలు రైతుగా ఉన్న పిన్నింటి మన్మథరావు ఓటుహక్కు వినియోగించుకోవడానికి స్వగ్రామం చిన్నబడాం వచ్చారు. మన్మథరావు టీడీపీకి ఓటేశారని తెలుసుకుని.. అర్ధరాత్రి ఆయన ఇంటికి తాళాలు వేసి వైసీపీ మూకలు వీరంగం సృష్టించాయి. విషయం తెలుసుకొని టీడీపీ నాయకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తాళాలు విరగ్గొట్టి ఆయన్ను అతికష్టంపై తిరిగి విజయనగరం పంపించారు. కాగా.. వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీకి ఓటు వేయకపోతే దాడి చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

వృద్ధుడిపై క్రికెట్ కర్రతో దాడి

పలాస మండలం అమలుకుడియా గ్రామానికి చెందిన బూర్జ అప్పలస్వామి అనే వృద్ధుడిపై ఓ వైసీపీ కార్యకర్త క్రికెట్ కర్రతో సోమవారం అర్ధరాత్రి దాడి చేశాడు. సోమవారం పోలింగ్ అనంతరం వైసీపీ నేతలు ఎద్దేవా చేశారు. దీంతో అప్పలస్వామి సైకిల్ స్పీడుగా ఉందని, ఎవరూ ఆపలేరని సమాధానం ఇవ్వడంతో కోపోద్రుక్తుడైన ఓ వైసీపీ కార్యకర్త ఆయన తలపై బలంగా క్రికెట్ కర్రతో కొట్టాడు. దీంతో అప్పలస్వామి కిందపడి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా.. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష.. ఆస్పత్రిలో ఉన్న వృద్ధుడ్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట లొడగల కామేశ్వరరావు యాదవ్, వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు ఉన్నారు.



కార్యకర్త రమణమూర్తిని పరామర్శిస్తున్న కుద్దిరాం టీడీపీ శ్రేణులు

సరుబుజ్జిలిలో ఇరువర్గాల కొట్లాట

- చిగురువలసలో పోలీస్‌పికెట్

సరుబుజ్జిలి, మే 14: పోలింగ్ పూర్తయినా.. గ్రామాల్లో ఎన్నికల వేడి రగులుతోంది. మంగళవారం సరుబుజ్జిలిలో చిగురువలసకు చెందిన టీడీపీ-వైసీపీ వర్గాల మధ్య వాగ్వాదం.. కొట్లాటకు దారి తీసింది. పోలింగ్ రోజు సోమవారం ఆమదాలవలస నియోజకవర్గంలో కొన్నిచోట్ల టీడీపీ-వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు తలెత్తిన విషయం తెలిసిందే. సరుబుజ్జిలి మండలం నందికొండ, రొట్టవలస, చిగురువలస, యరగాం, అమృతలింగానగరం, పురుషోత్తపురంలో తోపులాటలు, చిన్నపాటి కొట్లాటలు చోటుచేసుకున్నాయి. 21వ వార్డు కుద్దిరాంలో టీడీపీ కార్యకర్త మొయ్యిల రమణమూర్తిపై వైసీపీ శ్రేణులు దాడి చేయగా.. ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడిని మంగళవారం టీడీపీ నాయకులు పరామర్శించారు. కాగా.. గ్రామాల్లో ఎటువంటి వివాదాలు జరగకుండా ఎస్ఐ బి.నిహార్ ప్రధాన పార్టీల గ్రామస్థాయి నాయకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ.. మంగళవారం ఓ పని నిమిత్తం సరుబుజ్జిలి వచ్చిన చిగురువలసకు చెందిన టీడీపీ, వైసీపీ నేతల మధ్య కొట్లాట జరిగింది. టీడీపీ కార్యకర్త బసవ ఉమామహేశ్వరరావు, వైసీపీ కార్యకర్త నేతింటి శంకర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుని.. ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. చిగురువలసలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీస్‌పికెట్ ఏర్పాటు చేశామన్నారు. కాగా.. ఏ క్షణాన కొట్లాటలు, గొడవలు దాపురిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

స్ట్రాంగ్‌రూముల్లో ఈవీఎంలు భద్రం

కలెక్టరేట్/ గుజరాతీపేట, మే 14: పోలింగ్ ముగియడంతో జిల్లాలోని 8 నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లన్నీ.. చిలకపాలెం లోని శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. మంగళవారం ఉదయం జిల్లా ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటికి సీళ్లు వేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) కేంద్ర భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. వెలుపల వైపు రాష్ట్ర రిజర్వు పోలీసు దళాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. కళాశాల చుట్టూ మరో బృందం షిఫ్టుల వారీ విధులు నిర్వర్తిస్తాయి. అలాగే 24 గంటలు సీసీ కెమెరాల నిఘాతో పాటు రికార్డింగ్ కూడా చేస్తాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయే వరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతపై ఏవైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. అలాగే స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం పరిశీలించారు. భద్రతా అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మరో ఎన్నికల పరిశీలకుడు సందీప్‌కుమార్, జేసీ ఎం.నవీన్, టెక్కలి ఆర్‌వో నూరుల్‌కమర్, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్



స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు



పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక



మూలసవలాపురంలో చెరువు ఆక్రమణను అడ్డుకుంటున్న గ్రామస్థులు

చెరువు కబ్జాకు వైసీపీ నేతల యత్నం

సరుబుజ్జిలి, మే 14: సరుబుజ్జిలి మండలం మూలసవలాపురంలోని కామినాయుడు చెరువును మంగళవారం స్థానిక వైసీపీ నేతలు కబ్జాకు యత్నించగా.. స్థానికులు అడ్డుకున్నారు. ఇటీవల 60 ఎకరాలు ఉన్న ఈ చెరువు గర్భంలో సుమారు 7ఎకరాల భూమిని ముగ్గురు వైసీపీ నాయకులు ఆక్రమించినట్లు గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం ఆ ఆక్రమిత భూములకు గట్టులు వేసి.. హద్దులు నిర్ణయించుకుంటున్న సమయంలో గ్రామానికి చెందిన ఇరుపార్టీల ప్రజలు చెరువు వద్దకు చేరుకుని.. ఆక్రమణను అడ్డుకున్నారు. ఈ చెరువు ఆక్రమణకు గురైతే ఉపాధి పనులు కోల్పోతామని వేతనదారులు ఆందోళన చేశారు. దీనిపై రెవెన్యూ అధికారి, తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆక్రమణదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామస్థులు ఆ గట్లను తొలగించారు. కాగా.. చెరువు ఆక్రమణ విషయాన్ని తెలియజేసేందుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. తహసీల్దార్ కామినాయుడు స్పందించలేదని గ్రామస్థులు ఆరోపించారు. 150 ఎకరాలకు సాగునీరందిస్తున్న ఈ చెరువును కాపాడుకుంటామని, దీనిపై కలెక్టర్‌కు, జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సైన్స్ విద్యార్థుల కోసం

అన్ని బోర్డులకు సంబంధించిన టెన్త్, ఇంటర్ ఫలితాలు వెలువడ్డాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా కెరీర్‌ను తీర్చిదిద్దుకునేందుకు సమయం ఇదే. నిజానికి ఇప్పుడు ఎన్నో కెరీర్లు ఉన్నాయి. సైన్స్, కామర్స్, ఆర్ట్స్ అలాగే మెడిసిన్, ఇంజనీరింగ్.... ఇలా ఎటువైపు మొగ్గుచూపినా అందమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ఉదాహరణకు ఇంగ్లీష్ చదివితే ఏమి వస్తుందన్న ప్రశ్నకు లెక్చరర్, ట్రాన్స్‌లేటర్ కావచ్చన్నది ఒకప్పటి సమాధానం. కార్పొరేట్ ట్రైనర్ మొదలుకుని కంటెంట్ రైటింగ్ ఉనికిలోకి వచ్చిన తరవాత ఇంగ్లీష్ స్వరూప స్వభావమే మారింది. చివరాఖరుకు సినిమాలకు అడుగున ఆంగ్లంలోకి డైలాగ్స్‌ను అనువదించడం కూడా ఒక వృత్తిగా నేడు మారింది. ఏ సబ్జెక్టు తీసుకున్నా వృత్తిలో ఇమిడిపోగలిగే, నిలదొక్కుకోగలిగే విధమైన కెరీర్లు కుప్పలు తెప్పలుగా నేడు ఉన్నాయి. అలాగే కొన్ని వృత్తుల్లో చేరిన మొదటి నెలలోనే అధిక ఆదాయం ఉండదు. ఉదాహరణకు డాక్టర్ కాగానే, లాయర్ అవ్వగానే లక్షలు రావు. అనుభవం మాత్రమే అధిక ఆర్జనకు, ఆ వృత్తిలో నిలదొక్కుకునేందుకు వీలు కల్పిస్తాయి. ఏయే విభాగాల వారికి ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయో అవగాహన ఏర్పడితే చాలు. ఈ రోజుల్లో వివరాలు తెలుసుకోవడం సులువు. అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్‌లో వెతుక్కోవచ్చు. కోర్సుల ఎంపిక అనేది మున్ముందు జీవితాన్ని నిర్ణయించేది. అందుకే ఆచి తూచి అడుగు వేయాలి. ఎంపిక చేసిన కొన్ని కాలేజీలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించాం.

టెన్త్, ఇంటర్ తరవాత
What Next



సైన్స్ గ్రూపులు

మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, స్టాటిస్టిక్స్ మొదలైన సబ్జెక్టులతో అవకాశాలు

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జనరల్)
- మర్చంట్ నేవీ (సైన్స్ వారికి మాత్రమే)
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- ఫ్యాషన్ డిజైన్
- బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ స్టడీస్
- లా (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫారిన్ లాంగ్వేజెస్ (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫిల్మ్, ఇంటీరియర్ డిజైనింగ్

బైపీసీ
- అగ్రికల్చర్ సైన్సెస్ (వెటర్నరీ/డైరీ సైన్స్/ హ్యూమన్ బయాలజీ
- ఉపాధినిచ్చే కోర్సులు
- పోస్ట్‌గ్రాడ్యుయేషన్
- బయోటెక్, జెనెటిక్స్
- రీసెర్చ్/టీచింగ్

బైపీసీ

మెడిసిన్
- బీడీఎస్, ఆయుర్వేద, ఎండీఎస్
- ఎంబీబీఎస్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ స్పెషలైజేషన్) భారతదేశంలో 2, 3 సంవత్సరాలు, విదేశాల్లో అయితే 5 సంవత్సరాలు
- హోమియోపతి

పారా మెడికల్
- ఫిజియోథెరపీ
- ఆక్యుపేషనల్ థెరపీ
- స్పీచ్ థెరపీ
- ల్యాబ్ టెక్నాలజీ
- నర్సింగ్

బీఎస్సీ
- హోమ్ సైన్స్, హోమ్ ఎకనామిక్స్, హ్యూమన్ బయాలజీ, ఎన్విరాన్‌మెంట్
- ఎమ్మెస్సీ: చైల్డ్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్

ఎంపీసీ
- ఇంజనీరింగ్: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, కంప్యూటర్, మెటలర్జీ, ప్రొడక్షన్, మెరైన్, లెదర్, సిరామిక్, ప్లాస్టిక్, ప్యాకేజింగ్ టెక్నాలజీ
- టెక్నికల్ డిప్లొమాలు
- ఆర్కిటెక్చర్
- బీఫార్మసీ

దిక్సూచి
DIKSUCHI

ఏవియేషన్ ఇండస్ట్రీ

మేథమెటిక్స్, ఫిజిక్స్‌తో ఇంటర్ పూర్తి చేసినవారు ఏరోనాటికల్ ఇంజనీరింగ్, సంబంధిత ఉద్యోగాలు చేయవచ్చు. సైన్సేతర రంగాలకు చెందిన విద్యార్థులు కమర్షియల్ ఏవియేషన్‌లోని క్యాబిన్ క్రూ, గ్రౌండ్ డ్యూటీ ఉద్యోగాలు ఎంచుకోవచ్చు. క్యాబిన్ క్రూ విషయంలో కొంత ఎగ్జయిట్‌మెంట్ ఉంటుంది. వివిధ దేశాలు తిరగడం, భిన్నమైన వ్యక్తులను కలుసుకోవడం వీరి ఉద్యోగంలో భాగం.

ఏవియేషన్ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు
- Central training establishment, Hyderabad.
- Global institute, B-1/637, 1st Flr, Janakpuri, Delhi - 110058
- Indian aviation academy, Office 7& 8, Rushabh Complex, Oshiwar Link Road, Andheri West, Mumbai - 400053.
- Aptima air hostess academy, Block-J, Rajouri garden, New Delhi-110027

సివిల్ ఏవియేషన్

భారతదేశంలో పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్ అత్యున్నతమైన సంస్థ. ఇది దేశంలోని ఎయిర్‌పోర్టులకు సంబంధించిన చాలా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసినవారు కూడా ఈ రంగంలోకి వెళ్లవచ్చు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, కమర్షియల్ డివిజన్ ఉంటాయి. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఫిట్టింగ్ మొదలు ఎగిరే ప్రక్రియ వరకు ఇంజనీరింగ్ విభాగం పనే. కమర్షియల్ విభాగంలో కార్గో, ప్యాసింజర్ విమానాల సేవలు ఉంటాయి. పైలెట్ ట్రెయినింగ్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. వీటికి ఫీజు లక్షల్లో ఉంటుంది. ఎంట్రెన్స్ టెస్టులు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. కంటిచూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి. కమర్షియల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్, టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, ఎయిర్ క్రాఫ్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, కమర్షియల్ ఆపరేషన్ డివిజన్‌లో ఉద్యోగాలు ఉంటాయి. హోదాను బట్టి వీటిల్లో వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు నెల వేతనాలు లభిస్తాయి.

Colleges, Institutions and Universities

Some of the institutes offering aviation courses are as follows.
- Indian Institute of Aeronautics, Delhi.
- Bharat institute of aeronautics, Patna.
- Institute of aeronautics & Engineering, Bhopal.
- Flytech Aviation, PlotNo:24, Arunodaya Building, Paigah Colony, S.P Road, Secunderabad, Hyderabad-500006, Telangana, INDIA. Tel: (91)-040-66200000
- Avalon aviation academy, aptech house, A/65, MIDC, Andheri (E), Mumbai- 400093.
- There are multiple Aviation centres in Mumbai itself.
- Bombay university or Mumbai university now offers a 3 year B.Sc course in aviation. The course is being conducted by the institute of aviation and aviation safety (IAAS), an educational wing of the Mumbai based federation of Indian pilots. This course also trains students to be pilots and thus also offers commercial pilot's licenses (CPL) if one wishes to become a pilot.

మెరైన్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో మెరైన్ ఇంజనీరింగ్ కూడా ప్రత్యేకమైనది. సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ రంగంలోకి వెళ్లడానికి అర్హులు. ఐఐటీల్లో సీటు రావాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు తెచ్చుకోవాల్సిందే. ప్రైవేటు రంగం విస్తృతం అవుతున్న ఈ రోజుల్లో దీనికి మంచి భవిష్యత్తు ఉంటుందనడంలో ఎలాంటి అనుమానం లేదు.

ఐఐటీలు కాకుండా మెరైన్ ఇంజనీరింగ్‌ను అందిస్తున్న కాలేజీలు

List of marine engineering colleges
- T.S. Chanakya, karaus, New Mumbai - 400 706
- Haldia Institute of Maritime Studies And Research ICARE Complex, Marine Campus, P.O. Hatiberia, Haldia Dist. Purba Medinipur, 721657, West Bengal. Phone Nos: 03224 267501 / 267502
- RL Institute of Nautical Science, T.V.R Nagar Aruppukottai Road Elliyerpatti, Madurai, Tamil Nadu 6250224. Phone: 0452 391 8614
- Marine Engineering Research Institute, P-19, Taratolla Rd, Kol kata - 700088, Ph:033 2401 4675.
- Marine Engineering & Research Institute, Hay Bunder Road, Mumbai - 400033
- Lal Bahadur Shastri College of Advanced Maritime Studies & Research, Hay Bunder Road, Mumbai, Maharashtra 400033. Ph: 022 2371 9931
- The Calcutta Technical School, 110 SN Banerjee Road, Kolkatta - 700013
- Andhra University College of Engi neer-ing- Visakhapatnam, Andhra pradesh
- White Shark Marine Institute-New Delhi, Delhi
- Gujarat Technological University-Ahmedabad, Gujarat
- Praveenya Institute Of Marine Enginee ring - Vizianagaram, Andhra pradesh

కంప్యూటర్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో చేరాలనుకుంటే డిగ్రీ స్థాయిలో బిసిఏ ఉండేది. అయితే ఇంజనీరింగ్, ఎంసిఏ కోర్సుల్లో సీట్లు పెరిగిన తరవాత బిసిఏకు తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ తగ్గింది. అలాగే ఇంటర్‌లో మేథ్స్ చదివి, డిగ్రీ పూర్తిచేసినవారు మాత్రం ఎంసిఏ కోర్సులో చేరవచ్చు. ఏ సబ్జెక్టులతోనైనా డిగ్రీ అర్హతతో పెద్ద సంస్థల్లో కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకుని సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా, హార్డ్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా స్థిరపడుతున్నారు. ఎంబిఏకు తోడు సాఫ్ట్‌వేర్‌పై మంచి అవగాహన ఉన్నవారు సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. మొత్తం ఇంజనీరింగ్ కోర్సులకున్న అవకాశాలతో సమానంగా ఐటీ ఉద్యోగాలు లభిస్తున్నాయి. బీఈ/బీటెక్‌లో మొదట సీఎస్ఈ మాత్రమే ఉండేది. కాలక్రమంలో పలు ఆప్షన్స్ అందులోనూ వచ్చాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఐఓటీ, క్లౌడ్, బ్లాక్‌చెయిన్.. ఇలా పలు విభాగాలు ఆవిర్భవించాయి. ఇవన్నీ కలిసి, వేర్వేరుగా ఒక కోర్సుగా రూపొందాయి.

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ

మేథ్స్‌తో ఇంటర్ తరవాత ఇంజనీరింగ్‌లో చేరవచ్చు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ సహా పలు ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తున్నాయి. అవి చేసి ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీర్, అగ్రికల్చరల్ ఇంజనీర్, మైనింగ్ అండ్ పెట్రోలియం ఇంజనీర్, ప్లాస్టిక్ అండ్ రబ్బర్ టెక్నాలజిస్ట్, సిరామిక్ టెక్నాలజిస్ట్, టెక్స్‌టైల్ టెక్నాలజిస్ట్, ప్యాకేజింగ్ టెక్నాలజిస్ట్, లెదర్ టెక్నాలజిస్ట్‌లు కావచ్చు.

షిప్పింగ్ ఇండస్ట్రీ


కనీసం 60 శాతం మార్కులతో ఫిజిక్స్, మేథమెటిక్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు షిప్పింగ్, మర్చంట్ నేవీకి సంబంధించిన కోర్సుల్లో చేరవచ్చు. ఎంట్రెన్స్ టెస్టులు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. ఇందులో డిగ్రీ, డిప్లొమా కోర్సులు ఉంటాయి. కంటిచూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి. ప్రధానంగా రెండు రకాల కోర్సులు ఉంటాయి.
- షిప్పింగ్
- మర్చంట్ నేవీ

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/pZH3yY5లో చదవండి.


నవ్య | చిత్రజ్యోతి

వర్క్ పూర్తి చేసుకున్న తలైవా



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'వేట్టయాన్' చిత్రం షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమా తెలుగు టైటిల్ ఏమిటన్నది ఇంకా వెల్లడించలేదు. 'జై భీమ్' సినిమాకు దర్శకత్వం వహించిన టీజే జ్ఞానవేల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ బేనరుపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా, మంజు వారియర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తన పాత్రకు సంబంధించిన వర్క్‌ను రజనీకాంత్ పూర్తి చేసుకోవడంతో చిత్ర యూనిట్ ఆయనకు వీడ్కోలు పలికింది. భారీ స్థాయిలో అంచనాలు కలిగిన ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తుండగా, ఎస్.ఆర్.కతీర్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

భారీ సెట్‌లో నాని పోరాటాలు



ఇంతకుముందెన్నడూ పోషించని పవర్ ప్యాక్డ్ పాత్రలో నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పతాక సన్నివేశాల కోసం ఓ భారీ సెట్ వేశారు. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్ జె సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి చెప్పారు.

లవ్ బడ్డీ



'ఊర్వశివో రాక్షసివో' చిత్రం తర్వాత అల్లు శిరీష్ నటిస్తున్న చిత్రం 'బడ్డీ'. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని తొలి పాట 'ఆ పిల్ల కనులే..'ను బుధవారం విడుదల చేస్తున్నారు. హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాట ఇది. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

రూ.835 కోట్లతో రామాయణ



ప్రస్తుతం అందరి దృష్టీ బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' మీదే ఉంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ సినిమాను రూపొందించడానికి దర్శకుడు నితీశ్ తివారి కృషి చేస్తున్నారు. రెండు భాగాలుగా తయారవుతున్న ఈ సినిమా బడ్జెట్ ఎంతో తెలుసా? రూ. 835 కోట్లు. అది కూడా కేవలం తొలి భాగం కోసమే. నిర్మాణపరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత నమిత్ మల్హోత్రా ఖర్చు పెడుతూ, భారతీయ భాషలన్నింటిలోకి సినిమాను విడుదల చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. సినిమా షూటింగ్ ఒక ఎత్తు అయితే, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఎంతో కీలకం. అందుకే 600 రోజులు కేవలం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కోసం కేటాయించనున్నారు. విమర్శలకు ఎక్కడా తావు లేకుండా, భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా మరోసారి చాటే విధంగా 'రామాయణ' నిర్మాణం జరుగుతోంది. మరి ఈ పినిమా విడుదల ఎప్పుడు? ఆ విషయంలో కూడా క్లారిటీ ఇచ్చారు ట్రేడ్ ఎనలిస్ట్ సుమిత్ కడెల్. ' 2027 అక్టోబర్‌లో 'రామాయణ' చిత్రం తొలి భాగం విడుదలవుతుంది' అంటూ ఎక్స్ ఖాతా ద్వారా ఆయన వెల్లడించారు.

ఆ మాస్క్ కథ ఏమిటి?



'ప్రేమిస్తే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తమిళ నటుడు భరత్ నటించిన 'మిరల్' సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. వాణి భోజన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఎం.శక్తివేల్ దర్శకత్వం వహించారు. సీహెచ్ సతీశ్‌కుమార్ నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ అందరినీ భయపెట్టింది. తాజాగా రిలీజ్ డేట్ వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. ట్రైలర్‌లో ఓ వింత మాస్క్ హైలైట్ అయింది. పోస్టర్‌లోనూ ఆ మాస్క్ కనిపించింది. ఆ మాస్క్ కథ ఏమిటన్నది చిత్రం చూస్తే కానీ తెలియదని దర్శకుడు అంటున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎన్.ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సురేశ్ బాలా, సమర్పణ: జగన్మోహిని, ఢిల్లీ బాబు.

రియలిస్టిక్ ఎంటర్‌టైనర్



పాపులర్ కమెడియన్ గెటప్ శీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 17న 'రాజు యాదవ్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణమాచారి మాట్లాడుతూ.. "దాదాపు 90 శాతం మంది మనుషుల్లో ఏదో ఒక చిన్న లోపం ఉంటుంది. ఇండియన్ మాజీ క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి చిన్నప్పుడు ఏదో సర్జరీ జరిగింది. దాని కారణంగా ఆయన ఎప్పుడూ నవ్వుతున్నట్లే కనిపిస్తారు. ఈ స్ఫూర్తితో కథ రాసుకుంటే బాగుంటుంది అనిపించింది. నాకు సహజత్వం అంటే ఇష్టం. అందుకే ఈ సినిమాను ఓ రియలిస్టిక్ ఎంటర్‌టైనర్‌లా తెరకెక్కించాను. ఈ పాత్రకు జీవం పోసే నటుల కోసం వెతికే క్రమంలో గెటప్ శీను ఈ రోల్‌కు యాప్ట్ అనిపించింది" అని చెప్పారు.

ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో...



నిఖిల్ విజయేంద్రసింహా, తేజు అశ్విని జంటగా నటిస్తున్న చిత్రం 'సంగీత్'. సాద్ ఖాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ మనోహరన్, మాజ్ ఖాన్ నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. నిహారిక కొణిదెల చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించగా, శౌర్య కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ముహూర్తపు షాట్‌కు ఎస్.ఎస్.కార్తికేయ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు సాద్ ఖాన్ మాట్లాడుతూ "ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో సాగే కథ ఇది. ఓ పెళ్లి వేడుకలో జరిగే సంఘటనలను వినోదభరితంగా తెరకెక్కిస్తున్నాము" అని అన్నారు. హీరో నిఖిల్ విజయేంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా కథ నా హృదయానికి దగ్గరగా ఉంది. ఇందులో కథానాయకుడు సమర్థ్ పాత్రలో నేను, స్వర పాత్రలో తేజు అశ్విని నటిస్తున్నారు" అని చెప్పారు.

విడిపోవడమే మా ఇద్దరికీ మంచిది

జీవీ ప్రకాశ్ కుమార్

తమిళ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాశ్ కుమార్, గాయని సైంధవి దంపతులు తమ వైవాహిక బంధానికి ముగింపు పలికారు. విడాకులు తీసుకొన్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిద్దరూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. 'మేమిద్దరం ఎంతో ఆలోచించిన మీదటనే విడిపోవాలనే నిర్ణయం



తీసుకున్నాం. ఇది మా ఇద్దరికీ మంచిదని నమ్ముతున్నాం. ఇకపై ప్రశాంతంగా జీవితాన్ని కొనసాగిస్తాం. మా కెరీర్‌లో మరింత రాణించేందుకు ఈ మార్పు దోహదం చేస్తుందనుకుంటున్నాం. మా నిర్ణయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం' అని జీవీ, సైంధవి ప్రకటనలో పేర్కొన్నారు. వారిద్దరూ 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కూతురు అన్వీ ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌కు జీవీ మేనల్లుడు అవుతాడు. 'అసురన్, సూరారైపోట్రు, రాజారాణి, ఒంగోలు గిత్త' తదితర చిత్రాలకు జీవీ సంగీతం అందించారు. హీరోగానూ పలు చిత్రాల్లో నటించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WTdsiVZ లో చదవండి.

ఓటమి భయంతోనే దాడులు

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష



మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస: ఓటమి భయంతోనే టీడీపీ నేతలపై వైసీపీ నాయకులు దాడులకు దిగుతున్నారని పలాస టీడీపీ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. పోలింగ్ అనంతరం సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత పలాస-కాశీబుగ్గ పట్టణంలోని చిన్నబడాం, పలాస మండలం అమలు కుడియా, హరిపురం, పెదంచల పరిధిలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. హుందాగా రాజకీయాలు చేస్తే బాగుంటుందని, ఇదే విధానాన్ని కొనసాగిస్తే జూన్ 4 తరువాత తాము కూడా ఎదురుదాడి చేయక తప్పదని హెచ్చరించారు. దాడులతో భయపెట్టలేరనే విషయాన్ని గుర్తించాలని, టీడీపీ క్రమ శిక్షణ కలిగిన కుటుంబమని, అనవసరమైన రాద్ధాంతం చేస్తే తగు మూల్యం తప్పదని స్పష్టం చేశారు.

అందరికీ ధన్యవాదాలు

ఎటువంటి అలజడులు లేకుండా ఓటు వినియోగించుకున్న ఓటర్లందరికీ కృతజ్ఞతలని శిరీష అన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన జన సేన, బీజేపీ, టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రం లోను కూటమి ప్రభుత్వం రానున్నదని, వస్తున్న సర్వేలు, ఓటింగ్ శాతం పెరగడం తో పూర్తి నమ్మకం, విశ్వాసం పెరిగిందన్నారు. అందరం కలిసి సమష్టిగా పలాసను అభివృద్ధి చేద్దామన్నారు. కార్యక్రమంలో నేతలు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్ రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, సప్ప నవీన్, చంద్రశేఖర్ త్యాడి, జోగ మల్లి పాల్గొన్నారు.

జనసేన క్యాడర్‌కు కృతజ్ఞతలు

కాశీబుగ్గ: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థు విజయానికి కృషి చేసిన నేతలు, కార్యకర్తలకు జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని, దీనికి పాటుపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.



నందిగాం: గోతులతో నిండిన జడ్యాడ రహదారి



సరుబుజ్జిలి: మహిళ ప్రాణం తీసిన చిగురువలస రోడ్డు



సరుబుజ్జిలి: చెరువును తలపిస్తున్న చిన్న మతలబుపేట రహదారి

నరకానికి నకళ్లు.. ఈ దారులు

● దారుణంగా ఉన్న గ్రామీణ రోడ్లు ● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

● ఇదీ జిల్లాలోని పలు గ్రామాల్లో తీరు ● తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



పలాసరూరల్: వీఆర్‌సీపురం వెళ్లే రోడ్డు పనులు మధ్యలో నిలిపేసిన దృశ్యం

జిల్లాలో పలు గ్రామీణ ప్రాంత రహదారులు దారుణంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా గతుకుల మయమే.. తరచూ ప్రమాదాలు జరిగి కొందరు ఆసుపత్రి పాలవుతున్నా.. మరి కొందరి ప్రాణాలు హరీ మంటున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అసలే గోతులు ఆపై ఏమాత్రం వర్షం కురిసినా ఇక ఆ రోడ్డు పరిస్థితి ఆలోచించుకుంటేనే ఆవేదన చెందాల్సిన దుస్థితి.. ఈ రోడ్లపై నెలలు, సంవత్సరాల తరబడి రాకపోకలు సాగిస్తూ ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కొన్ని రోడ్ల మరమ్మతుల పేరుతో తాత్కాలికంగా తూతూ మంత్రంగా పనులు చేసినా అవి ఎన్నాళ్లూ ఉండడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల దుస్థితిపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పలాసరూరల్: రేగులపాడు గ్రామ రోడ్డు దుస్థితి



టెక్కలి: గోతులమయమైన నౌపడా-మెళియాపుట్టి రోడ్డు



వజ్రపుకొత్తూరు: రాళ్లు తేలి ఉన్న శివరాంపురం రోడ్డు

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

● మెజార్టీలపై చర్చోపచర్చలు

● అభ్యర్థులను కలిసి అభినందించిన నేతలు

● క్షేత్రస్థాయిలో పోలింగ్‌పై ఆరా

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కూటమి నేతల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. సోమవారం పోలింగ్ జరగ్గా.. తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందన్న ఆనందం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం అభ్యర్థులను ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు కలిసి హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎంత మెజార్టీ వస్తుందనే అంచనాలపై నాయకులంతా చర్చించుకున్నారు. జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది.



కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో అచ్చెన్నాయుడును అభినందిస్తున్న నేతలు, కార్యకర్తలు

అచ్చెన్న వాకిట కోలాహలం

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడ, కోటబొమ్మాళిలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కోలాహలం నెలకొంది. వివిధ గ్రామాల నుంచి ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు వచ్చి క్షేత్రస్థాయిలో పడిన ఓటింగ్ శాతంపై అంచనాలను అచ్చెన్నాయుడుకు వివరించారు. నియోజకవర్గంలో మనకు మంచి ఓటింగ్ పడిందని, ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారని, ప్రధానంగా మహిళలు, యువత, వలస ఓటర్ల నుంచి మంచి స్పందన వచ్చిందని వారు అచ్చెన్నాయుడుకు వివరించారు. పలుచోట్ల పోలింగ్ రాత్రి 10 గంటల వరకు కొన సాగడానికి కారణాలు కూడా తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నా యుడును క్యాడర్ ముందస్తుగా పూలమాలలు, బొకేలు అందించి అభినందించారు. కేకలు కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తన కోసం ఈ ఎన్నికల్లో కష్టపడిన ప్రతీ కార్యకర్త రుణం తీర్చుకోలేనిదన్నారు.

ఓటింగ్ సరళిని చర్చిస్తూ..

నరసన్నపేట: ఎన్నికల నేపథ్యంలో నరసన్నపేటలో సోమవారం పోలైన ఓటింగ్ సరళిపై కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పార్టీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం సమీక్షించారు. బూత్ లెవెల్ నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలు కూటమి అభ్యర్థులకు పడిన ఓటింగ్ సరళిని విశ్లేషించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ.. ప్రజా స్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఓటింగ్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ తాను రుణపడి ఉంటానన్నారు. కూటమి విజయం తథ్యమని, దీనికి సహకరించిన టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనేక గ్రామాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలతో కార్యాలయం కోలాహలంగా కనిపించింది.

క్యాడర్ నుంచి ఆరా తీస్తూ...

అరసవల్లి: ఎన్నికలు ముగియడంతో టీడీపీ అభ్యర్థుల్లో నూతనోత్సాహం కనిపించింది. మంగళవారం శ్రీకాకుళం, ఆమదాలవలస ఉమ్మడి అభ్యర్థులు గొండు శంకర్, కూన రవికుమార్ కార్యాలయాలు, ఇళ్ల వద్ద సందడి కనిపించింది. శంకర్ కార్యాల యంలో పలువురు నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ.. టీడీపీ విజయం తథ్యమని, దీనికి కారకులైన ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల వారీగా పోలింగ్ సరళిపై క్షేత్రస్థాయి నేతలతో చర్చించారు. అలాగే ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ స్వగృహం కార్యకర్తలతో కిటకిటలాడింది. 2014 నాటి ఫలితాలు పునరావృతం అవుతాయని కార్యకర్తలు ఆయనకు స్పష్టం చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను లెక్కలు పరిశీలించి టీడీపీ గెలుపు ఖాయమని వారు పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రావడం లాంఛనమేనని, దీనికి సహకరించిన ప్రతిఒక్కరికీ రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



బగ్గు రమణమూర్తిని కలిసిన తామరాపల్లి కార్యకర్తలు



నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గొండు శంకర్



నేతలు, కార్యకర్తల కోలాహలం మధ్య రవికుమార్

అమ్మో కుక్కలు

● ఆవుదూడపై దాడి, తీవ్రగాయాలు

● భయాందోళన చెందుతున్న ప్రజలు



తీవ్రంగా గాయపడిన ఆవు దూడ

నందిగాం: మండల కేంద్రమైన నందిగాంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఎటువైపు నుంచి వచ్చి దాడిచేస్తాయోనని ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. పశువులను, కోళ్లను, చిన్నారులను గాయపరుస్తున్నాయి. అలాగే ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం ఉదయం నందిగాంకు చెంది న కొన్ని ప్రయోగ మూర్తికి చెందిన ఆవుదూడపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటు న్నాడు. నంది గాంలో ఏ వీధిలో చూసినా కుక్కల సంచారం కనిపిస్తోంది. పంచాయతీ అధికా రులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాల సందడి



ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: పలు గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాల సందడి నెల కొంది. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ముర్రాటల సమర్పణ, మొక్కుల చెల్లింపులను చేపట్టారు. ఎల్ఎన్ పేటలో బంగారు సంతోషి అమ్మతల్లికి మంగళవారం ఘటాలు నివేదన చేపట్టారు. పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 28వ తేదీ వరకు పురోహితుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రత్యే క పూజలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎం.దివాకర్ నాయుడు, గ్రామ పెద్దలు వి.పాండురంగనాథరాజు, ఎం.జనార్ధనరావు, డి.తిరుమలరావు, రామ్‌నాథ్ మహాపాత్రో తెలిపారు.

రాధావల్లభాపురంలో...



కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

టెక్కలి: రాధావల్లభాపురం గ్రామంలో మంగళవారం గ్రామదేవత సంబరాలు అంబరాన్ని తాకాయి. దేవర తెచ్చుట, అమ్మవారికి ముర్రాటల సమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. రకరకాల వేషధారణలతో పలువురు ఆకట్టుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మంగళవారం సాయంత్రం అమ్మవారిని కలశాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో బగాది శేషగిరి, కిల్లి మల్లన్న, అజయ్‌కుమార్, శిష్టు జగం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో...

నరసన్నపేట: వైశాఖ మాసం మంగళవారం సందర్భంగా పట్టణంలో నూకా లమ్మ, పైడితల్లి, శాంతమ్మ తల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ముర్రాట్లు చెల్లించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కోమర్తి గ్రామంలో ముద్దాడ కుటుంబీకులు గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించారు. ఘటాలతో ఊరేగించి గ్రామదేవతకు మొక్కులు చెల్లించారు.



పూజలందుకుంటున్న శాంతమ్మ అమ్మవారు

ఘనంగా వృషభ సంక్రమణ పూజలు

పలాసరూరల్: స్థానిక సీతారామాలయంలోని జగ న్నాథ మందిరంలో జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వృషభ సంక్రమణ పూజలు, హోమాలు మంగళవారం నిర్వహించారు. లోకకల్యాణం కోరుతూ ప్రతి నెలా నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి బాబూరావు పండా తెలిపారు. రాఘవ పండా, కామేశ్వర పండా, బాలకృష్ణ పాల్గొన్నారు.




పలాస రూరల్: పలాస-విశాఖ పాసింజర్‌లో వెళుతున్న వలస ఓటర్లు

వలస ఓటర్లు తిరుగుముఖం

● స్వగ్రామాల్లో ఓట్లు వేసి పయనం

● రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో పట్టణాలకు..

నందిగాం/పలాస రూరల్/పోలాకి: ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారంతా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్లు వేసేందుకు గడచిన నాలుగు రోజులుగా స్వగ్రామాలకు వచ్చిన వారంతా సోమవారం ఓట్ల పండుగ పూర్తి కావడంతో మంగళవారం తిరుగుముఖం పట్టారు. జిల్లాలోని వివిధ ప్రాంతా లకు చెందిన వారు ఇతర రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కూలీ లు ఓట్లు వేసి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో పయనమయ్యారు. తెలంగాణా, కాండ్లా, పారాదీప్, ముంబై, గుజరాత్, బెంగుళూరు, గోవా, హైదరాబాద్, విశాఖ పట్నం, తిరుపతి, రాయపూర్, నాగ్‌పూర్, విజయనగరం, తమిళనాడు, నెల్లూరు, విజయవాడ తదితర పట్టణాలకు వెళ్లారు. వారంతా ఒక్కసారి రైళ్లలో పయనిం చేందుకు వెళ్లడంతో రైళ్లు కిటకిట లాడాయి. రైలు ద్వారా వెళ్లాల్సిన వారికి సరైన రిజర్వేషన్ లేకపోవడం, ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తే అధిక ధరలు తీసుకుంటుం డడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సమయానికి వచ్చి ఓట్లు వేశామని సంతృప్తిని వ్యక్తం చేస్తూనే తిరుగు ప్రయాణానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని పలువురు పేర్కొంటున్నారు. నందిగాం మండలం దిమ్మిడిజోల, దీనబంధుపురం, అన్నాపురం, మదనాపురం, నౌగాం, కర్లపూడి తదితర గ్రామాలకు చెందిన వలస ఓటర్లు ఓటు వేసేందుకు ప్రత్యేక బస్సుల్లో వచ్చి ఓటు వేసి తిరిగి అవే బస్సుల్లో బయలుదేరారు. వలస ఓటర్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారించడంతో వారంతా ఉత్సాహంగా వచ్చారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేనివిధంగా వలస ఓట ర్లు అధిక సంఖ్యలో వచ్చి ఓటు వేయడంతో ఎవరికి మద్దతిచ్చారన్న విషయమై గ్రామాల్లో చర్చించు కుంటున్నారు.



నందిగాం: కారులో తిరిగి వెళ్తున్న దృశ్యం

మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలి

టెక్కలి: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు సముదాయం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో మధ్యవర్తుల పాత్ర, మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలు, మధ్యవర్తిత్వం ఆవశ్యకత తదితర అంశాలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, కార్యదర్శి దివాకర్, న్యాయవాది ఖజాన వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి

మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం



జలుమూరు: కరకవలస గ్రామానికి చెందిన కరుకోల లక్ష్మి కుటుంబానికి పూర్వ విద్యార్థులు రూ.50 వేల సాయాన్ని మంగళవారం అందించారు. 1999-2000 సంవత్సరంలో శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న కరకవలస గ్రామానికి చెందిన కరుకోల ఈశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు గాను అతని సహచర విద్యా ర్థులు భార్య లక్ష్మికి అందించారు.

రొయ్యల చెరువు పరిశీలన

బెలమర(పోలాకి): బెలమర గ్రామంలో చింతు అప్పన్న సాగుచేస్తున్న రొయ్యల చెరువులో విషప్రయోగం చేశారని బాధిత రైతు ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్ఐ సత్య నారాయణ సదరు చెరువును పరిశీలించారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆయనకు ఎస్ఐ సూచించారు. విష ప్రయోగం వల్ల సుమారు రూ.30 లక్షల విలువైన రొయ్యలు మృత్యువాత పడ్డాయని రైతు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భాగస్వామ్యమవ్వండి

నరసన్నపేట: స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, ఎం.జగదీష్ కోరారు. పట్టణంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తు న్నందున ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

మహిళలే నిర్ణేతలు

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 69.77 శాతం పోలింగ్
- 2019లో 70.23 శాతం నమోదు
- అన్నిచోట్లా మహిళల ఓట్లే కీలకం

సార్వత్రిక ఎన్నికలలో విజయావకాశాలపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు విజయావకాశాలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధిక శాతం నియోజకవర్గాలలో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంది. దీంతో అభ్యర్థుల గెలుపు.. ఓటములలో వీరే ప్రధాన పాత్ర పోషించనున్నారు.

ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, మే 14: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చిన్న, చిన్న సమస్యలు తప్ప సజావుగా జరగటంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటర్లు రాత్రి 9 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 299 పోలింగ్ స్టేషన్లలో చెదురుమొదురు సంఘటనలు మినహా సజావుగా జరిగింది. 2019 నాటి ఎన్నికల్లో 70.23 శాతం పోలింగ్ కాగా ఈ ఏడాది 69.77శాతానికే పరిమితమైంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 2,68,202 మంది ఓటర్లు ఉండగా 1,87,136 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో మహిళలు 1,02,778 (74.78 శాతం)మంది, పురుషులు 84,356 (64.52 శాతం)మంది, థర్డ్ జెండర్స్ 12.94శాతం ఓటు హక్కును వినియోగిచుకున్నారు. మహిళలే అత్యధికంగా ఓటు వినియోగించుకోవటం విశేషం. పురుషుల కంటే మహిళలు 18,422మంది అధికంగా ఓటు వినియోగించుకున్నారు.

- కవిటి మండలంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేయటంతో పోలీసులు రంగప్రవేశం చేసి గొడవలను ఆపారు.

రాత్రి వరకు పోలింగ్..

ఇచ్ఛాపురంలో 12, 55 పోలింగ్ కేంద్రాలు, కవిటి మండలం బల్లిపుట్టుగ, ఇద్దివానిపాలెం, బెలగాం, కంచిలి మండలంలో బూరగాం, బురదపాడు, సోంపేట మండలంలో తాళపద్ర, గొల్లూరు, కర్తలిపాలెం పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8.30గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ సరళిని చూసి ఏ పార్టీకి ఆ పార్టీ తమ దే విజయమని ధీమా వ్యక్తం చేస్తోంది. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతరం చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో కూటమికే ఓట్లు వేశారని టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ విశ్వసిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు అధికార పార్టీ విధానాలతో విసుగెత్తిపోయి ఉన్నారని, వారంతా కూటమి వెంటే ఉన్నారని చెబుతున్నారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్‌కు తరలివచ్చారని వారి ఓట్లు తమకే పడతాయని వైసీపీ భావిస్తోంది.


టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వెబ్‌కెమెరాలను పరిశీలిస్తున్న అధికారులు

మహిళా ఓటర్లలో చైతన్యం

టెక్కలి, మే 14: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఈ విడత 2లక్షల 36వేల 327 మంది ఓటర్లకు గాను లక్షా 86వేల 897 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 95,569 మంది, పురుషులు 91,326 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 4,243 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. మొత్తంగా టెక్కలి నియోజకవర్గంలో 79.01శాతం పోలింగ్ జరిగినట్లు ఆర్‌వో నూరుల్ ఖమర్ వెల్లడించారు. 2019 ఎన్నికల్లో పోలింగ్ 78.02శాతం నమోదైంది. గత ఎన్నికల కంటే సుమారుగా ఒకశాతం ఓటింగ్ పెరిగింది. రాత్రి 10గంటల వరకు టెక్కలి మండలం చాకిపల్లి, కోటబొమ్మాళి మండలం దంతలో పోలింగ్ ప్రక్రియ జరిగింది. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 280 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కెమెరాలు ఏర్పాటుచేసి వాటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులను నియమించారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలో 315 పోలింగ్ స్టేషన్లలోను ప్రశాంతంగా ఓటింగ్ జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పలాస రూరల్: పలాస నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షల 19వేల 348 కాగా ఇందులో పురుషులు 1 లక్షా 7వేల 278 మంది. మహిళలు 1లక్షా 12వేల 049 మంది, ఇతరులు 21 మంది ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికలలో పురుషులు 76వేల 839మంది, మహిళలు 88వేల 416 మంది ఓట్లు వేశారు. మొత్తం లక్షా 65వేల 257మంది ఎన్నికల్లో ఓట్లు వేశారు. పోలింగ్ 75.34శాతం గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. మహిళల ఓట్లే విజేతను నిర్ణయించనున్నాయని విశ్లేషకుల అంచనా.

ఎవరి లెక్కలు వారివే!

మెళియాపుట్టి, మే 14: పోలింగ్ ప్రక్రియ పూర్తి కావటం.. ఓట్ల లెక్కింపునకు మరో 20 రోజులు ఉండడంతో అభ్యర్థులు గెలుపు ఓటములపై లెక్కలు వేసుకుంటున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 70.37 శాతం పోలింగ్ నమోదైంది. ఇది కూటమి అభ్యర్థికి కలసి వస్తుందని అంచనాలు వేసుకుంటున్నారు. ఈ లెక్కలు అధికార వైసీపీ శిబిరంలో ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు వైసీపీకి అనుకూలంగా ఉన్నారని ఆ పార్టీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,25,313 ఓట్లు ఉండగా.. 1,58,544 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 77,803 మంది, మహిళలు 80,738 మంది ఉన్నారు. అధికంగా మహిళలే ఓటు హక్కు వినియోగించుకున్నారు. పల్లెల్లోనూ ఎక్కడికక్కడ ఎన్నికల ఫలితాలపైనే జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

హిరమండలం: హిరమండలం మండలంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలలే ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 70 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసిల్దారు సుధాకర్ చెప్పారు. 23 పంచాయతీల్లోని 45 పోలింగ్ బూతుల పరిధిలో 32,447 మంది ఓటర్లుకు గాను 23,352 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో స్త్రీలు 9,290 మంది, పురుషులు 8,961 మంది ఉన్నారు.


పోలింగ్ రోజు రావివలసలో క్యూలో ఉన్న మహిళా ఓటర్లు

నువ్వలరేవుపైనే పార్టీల ఆశలు

- 85 శాతం పోలింగ్ నమోదు
- సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం

వజ్రపుకొత్తూరు: ఆచార సంప్రదాయాలకు నిలయమైన నువ్వలరేవు గ్రామానికి జిల్లాలోనే ఎంతో ప్రత్యేకత ఉంది. సార్వత్రిక ఎన్నికలలో ఏకంగా 85 శాతం పోలింగ్‌తో వీరు రికార్డు సృష్టించారు. వజ్రపుకొత్తూరు మండలంలో 67,040 మంది ఓటర్లకు గాను 47,400 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే 71 శాతం మాత్రమే మండలంలో పోలింగ్ జరిగింది. నువ్వలరేవు గ్రామంలో మొత్తం 4,835 మంది ఓటర్లు ఉండగా.. అందులో సోమవారం జరిగిన ఎన్నికలలో 4,121 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే 85.23 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొని రికార్డు సృష్టించారు. గ్రామంలో నాలుగు పోలింగ్‌బూత్‌లు మాత్రమే అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో వందల సంఖ్యలో గంటల తరబడి నిలబడి తమ ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచాలని గ్రామస్తులు ఎన్నిసార్లు అధికాలను కోరినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇదిలా ఉంటే నువ్వలరేవు ఓటర్లపై రాజకీయ పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. గ్రామంలో ఓటర్లు తమకే జై కొట్టారని ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామంలో ఉండే సంప్రదాయం ప్రకారం అన్ని రాజకీయ పార్టీలకు సాదరంగా గ్రామస్తులు ఆహ్వానించినా.. గ్రామ పెద్దల సూచనల ప్రకారం ఏదో ఒక పార్టీకే అత్యధిక మెజార్టీ ఇవ్వడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈసారి ఎన్నికలలో నువ్వలరేవులో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందోనని ప్రధాన రాజకీయ పార్టీలలో గుబులు పట్టుకుంది.


నువ్వలరేవులో ఓటు వేసేందుకు బారులు తీరిన జనం (ఫైల్)


క్షతగాత్రులను పరామర్శిస్తున్న గౌతు శిరీష

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- నలుగురికి గాయాలు

వజ్రపుకొత్తూరు, మే 14: వెంకటాపురం గ్రామం వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. వెంకటాపురం గ్రామానికి చెందిన లొడగల భీమారావు, జనపాల వసంతరావులు ఏటిలో స్నానాలు చేసుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి గ్రామానికి వస్తుండగా... గొదలాం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న కొర్రాయి అశోక్, డొక్కల కామరాజు వాహనంపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో లొడగల భీమారావుకు తలపైన, జనపాల వసంతరావుకు శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. గొదలాం గ్రామానికి చెందిన అశోక్, కామరాజులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నలుగురిని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రులను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.

పాముకాటుతో యువకుడి మృతి


శివానంద్ (ఫైల్)

నందిగాం, మే 14: పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన లఖినాన శివానంద్ అలియాస్ శివకుమార్ (21) అనే యువకుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శివానంద్ సోమవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు గమనించి టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా... అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శివానంద్ తండ్రి గతంలోనే మృతి చెందగా.. తల్లి పార్వతి, సోదరుడు పవన్ కుమార్ ఉన్నారు. స్థానిక సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు తదితరులు శివానంద్ మృతికి సంతాపం తెలిపారు.

రెచ్చిపోయిన రౌడీషీటర్

- కేఎఫ్‌సీలో సామాన్లు ధ్వంసం
- మేనేజర్‌తో పాటు మరో వ్యక్తిపై దాడి


అదపాక రవి


ఆశిష్

శ్రీకాకుళం క్రైం, మే 14: నగరంలో రౌడీషీటర్‌తో పాటు మరో ముగ్గురు కలసి ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని గొంటి వీధికి చెందిన ఢిల్లీశ్వరరావు అలియాస్ బాక్సర్ ఈశ్వర్, అతని సోదరుడు వెంకటరమణ పోలింగ్ జరిగిన 13వ తేదీ రాత్రి 11.15 గంటలకు రామలక్ష్మణ కూడలి సమీపంలో ఉన్న కేఎఫ్‌సీకి వెళ్లారు. ఆ సమయానికి అది మూసివేసి.. సిబ్బంది షాపులో శుభ్రం చేస్తున్నారు. ఢిల్లీశ్వరరావు, అతని సోదరుడు రమణ తమకు ఆహారం కావాలని ఆర్డర్ చేశారు. మూసివేసినట్టు అక్కడి మేనేజర్ అదపాక రవి తెలిపారు. దీంతో కోపోద్రిక్తులైన వారిద్దరూ బెదిరింపులకు దిగారు. తామేమీ చెయ్యలేమని.. అంతా ఆన్‌లైన్ వ్యాపారమని రవి వారికి వివరించాడు. దీంతో ఢిల్లీశ్వరరావు, అతని సోదరుడు దాడికి తెగబడ్డారు. అంతటితో ఆగకుండా రౌడీషీటర్ కొర్లకోట శేఖర్‌ను, హర్ష, రాజేంద్రను అక్కడికి పిలిపించి షాపులోని రూ.3.4 లక్షల విలువైన సామాన్లు ధ్వంసం చేశారు. ఆర్డర్ ఇవ్వలేదన్న కోపంతో అదపాక రవితో పాటు ఆశిష్ చౌదరిపై ఢిల్లీశ్వరరావు అతని సోదరుడితో పాటు శేఖర్ దాడి చేశారు. ఈ దాడిలో ఒకరికి ముక్కు పగిలిపోగా, మరొకరికి కంటిపై నాలుగు కుట్లు పడ్డాయి. దాడి చేసిన వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులను కేఎఫ్‌సీ సిబ్బంది చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అవుట్ పోస్టు పోలీసుల సమాచారం మేరకు రెండో పట్టణ సీఐ జి. ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు.

పీఆర్‌డీసీ పరీక్షల్లో మహేష్ ప్రతిభ

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విద్యార్థి కూరాకుల మహేష్ సత్తా చాటాడు. ఏపీ రెసిడెన్షియల్ డి గ్రీ కళాశాల ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంక్ సాధించాడు. ఆ విద్యార్థిని అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

గార: ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం నిర్వహణకు శ్రీకూర్మానికి చెందిన చేబోలు రాజేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం ఈ విరాళాన్ని ఈఓ జి.గురునాథరావు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహా చార్యులుకు ఆయన అందజేశారు.


ఈఓకు విరాళాన్ని అందజేస్తున్న రాజేశ్వరరావు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆమదాలవలస: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం 11 గంటలకు ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమా వేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

రేపు ఆమదాలవలసలో అవధానం

ఆమదాలవలస: ఈ నెల 16న గురువారం పట్టణంలో అవధాన సభ నిర్వ హించనున్నట్టు కచ్చపీ కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ తెలిపారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఊసవానిపేట రైల్వేగేటు వద్ద ఉన్న శారదా కళ్యాణ మండపంలో సుసరాపు చంద్రశేఖర్ శర్మ, రంప సాయికు మార్ శర్మ ఆధ్వర్యంలో ద్విగళ ద్విగుణిత అవధానం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా వృషభ సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం, మే 14: గ్రామదేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వృషభ సంక్రమణం పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేకువ జామున సిందూర మర్దన, కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం సహస్ర నామార్చనలు, హోమాలు, ప్రత్యేక దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణలో జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శిథిలావస్థలో కల్వర్టు

వజ్రపుకొత్తూరు: చినవంక నుంచి వయా పల్లిసారథి మీదుగా కాశీబుగ్గ వరకు గల తారురోడ్డుపై రిట్టపాడు గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. అప్పట్లో తారురోడ్డు నిర్మాణ సమయంలోనే కల్వర్టు నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. అయితే కల్వర్టు నిర్మాణానికి నిధులు సరిపోవంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కొత్తకల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో కల్వర్టు పరిస్థితి దారుణంగా తయారైంది. దీని రక్షణ గోడలు బీటలు వారడంతో ఎప్పుడు కూలుతుందో అనే భయం స్థానికులలో నెలకొంది. ఈ రోడ్డుపై 50 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు కూలితే భారీ ప్రమాదం జరగడంతో పాటు ఆ గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది.

హామీని నిలబెట్టు కోవాలి..

రిట్టపాడు కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కొత్త కల్వర్టు నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. కేవలం ప్రతిపాదనలకే పనులు సరిపెడితే ఎలా? కల్వర్టు కూలితే 50 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

-రెయ్యి గున్నయ్య, పల్లిసారథి


శిథిలావస్థలో ఉన్న రిట్టపాడు కల్వర్టు

తంపర సమస్యకు పరిష్కారమెప్పుడో!

- సీఎం జగన్ హామీ నెరవేరని వైనం
- ఏటా తప్పని ముంపు కష్టాలు
- టీడీపీ హయాంలో రూ.12 కోట్లు మంజూరు
- అయినా పనులు చేపట్టని అధికారులు

పోలాకి మండలం సుసరాం పరధిలోని తంపర పొలాల సమస్య దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా దీనికి విముక్తి లభించడం లేదు. రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. సాక్షాత్తూ సీఎం జగన్ హామీ ఇచ్చినా పరిష్కారం కాకపోవడం గమనార్హం.

-సుసరాం (పోలాకి)

బ్రిటిష్ కాలం నుంచి సుసరాం తంపర పంట పొలాల ముంపు సమస్య రైతులను పట్టి పీడిస్తోంది. వర్షాకాలంలో ఎగువ కాలువలు, పొలాల నుంచి వచ్చే నీరు తంపర పొలాల మీదుగా సముద్రంలోకి వెళ్లాలి. కానీ మధ్యలో 12 అడుగుల వెడల్పు ఉన్న వంశధార కాలువలు విస్తరించకపోవడం, రొయ్యల చెరువుల పేరిట ఆక్రమించడంతో సముద్రంలోకి నీరు వెళ్లక పంట పొలాలకు చేరుతోంది. దీంతో ఏటా పంట ముంపునకు గురవుతోంది. రైతులు ఇబ్బంది పడుతున్నారు. టీడీపీ హయాంలో తంపర ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వ్యవసాయ శాఖ మంత్రితో స్వయంగా పరిశీలింపజేసి రూ.12 కోట్లు మంజూరు చేయించారు. తర్వాత ఎన్నికలు రావడం... వైసీపీ నేతల నిర్లక్ష్యం కారణంగా విస్తరణ పనులు సగంలో నిలిచిపోయాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కాలువ మధ్యలో రొయ్యల చెరువులు ఏర్పాటు చేసి రైతులు భూములను ఆక్రమించేశారు. కాలువల విస్తరణ, వంతెన నిర్మాణం, ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని వంశధార ఇంజనీర్లు ప్రణాళికలు వేశారు. కానీ ఇంతవరకూ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ముంపు సమయంలో తంపర వద్దకు వెళ్లి ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు రైతులను పరామర్శించి హామీలు ఇచ్చి వెళ్లడం తప్ప పరిష్కారం చూపలేదు.

ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చినా...

2022లో ఉప ముఖ్య ముఖ్యమంత్రి కృష్ణదాస్ సుసరాం వద్ద తంపర సమస్యను పరిశీలించి షట్టర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి వెళ్లారు. సీఎం జగన్ నరసన్నపేటలో నిర్వహించిన బహిరంగ సభలో తంపర సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని చెప్పారు. దీనికి నిధులు కేటాయిస్తానని ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌ల సమక్షంలో హామీ ఇచ్చారు. కానీ తంపర రైతుల కల నెరవేరలేదు. తంపర సమస్యను పరిశీలించేందుకు వచ్చిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సుసరాం తంపర రైతుల తరఫున విశ్రాంత ఉపాధ్యాయుడు బాలక పాపినాయుడు అనేకసార్లు వినతులు సమర్పించి.. తంపర పోరాట యోధుడని స్థానికుల నుంచి పేరుపొందారు. తన కల నెరవేరకుండానే ఇటీవల ఆయన కన్నుమూశారు.


తంపర ఉప్పుగెడ్డను పరిశీలిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి (ఫైల్)

ప్రతిపాదనలకే పరిమితం..

తొలుత కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీఎం జగన్ మాతృమూర్తి విజయలక్ష్మి, ఎందరో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీఓలు, వంశధార ఇంజినీర్లు తంపర ముంపు సమస్యను పరిశీలించారు. ప్రతిపాదనలతో వెళ్లారు. కానీ అవి కార్యరూపం దాల్చలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ హామీ ఇచ్చిన తర్వాత ఇసుమంత కూడా పనులు చేపట్టకపోవడం విచారకరమని తంపర రైతుల ఆవేదన.

ఆక్రమణల బెడద..

తంపర భూముల వద్ద పాచాకుల గెడ్డ, ఉప్పుగెడ్డ, బుడగల గెడ్డ అనే మూడు కాలువలు ఉన్నాయి. 8 కిలోమీటర్ల పొడవున, 12 అడుగుల వెడల్పుతో వంశధార కాలువలు ఉండేవని, ప్రస్తుతం అవి అడుగు పెట్టడానికి కూడా వీలు లేనంతా కుదించుకుపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కాలువలను సమీప రైతులు ఆక్రమించి రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, ఎన్ని ఫిర్యాదులు చేసినా ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ అధికారులు చొరవ చూడపం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా తంపర ముంపు సమస్య పరిష్కారం కావడం లేదని నిట్టూరుస్తున్నారు.

కాలువలను విస్తరించాలి..

తంపర వద్ద ఉన్న వంశధార కాలువలను విస్తరించాలి. ఆక్రమణలు తొలగించాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువ విస్తరణ పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ అధికారులు చొరవ చూపాలి.

-తమ్మినాన శారద, ఎంపీటీసీ, ఉరజాం, పోలాకి మండలం

లిఫ్టుల హామీ ఏమైంది?

మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ 2022లో తంపర ముంపును పరిశీలించి లిఫ్టులు ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అమలు కాలేదు. ఆ తర్వాత నరసన్నపేట పర్యటనకు వచ్చిన సీఎం జగన్ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. నేటికీ నెరవేరలేదు.

-లావేటి కృష్ణ, ప్రియాగ్రహారం

ఏటా పంట నష్టం..

తంపర భూముల ముంపు వల్ల ఏటా వరిపంటకు చాలా నష్టం వాటిల్లుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి వెళుతున్నారు తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడంలేదు. వంశధార ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు చొరవ చూపాలి. ముంపు నుంచి బయట పడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి. పేద రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

-తమ్మినాన ఈశ్వరరావు, సుసరాం

టీడీపీ హయాంలో రూ.12 కోట్లు మంజూరు..

తంపర ముంపు నివారణకు టీడీపీ హయాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మంత్రి అచ్చెన్నాయుడు, కృషితో రూ.12 కోట్లు మంజూరు చేశారు. కానీ వంశధార కాలువల విస్తరణ జరగలేదు. నిర్మించిన డాంలు శిథిలమవుతున్నాయి. తంపరకు వెళ్లే రహదారి ఛిద్రమవుతోంది. వైసీపీ హయాంలో తంపర సమస్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. తంపర భూముల సమస్యకు టీడీపీ అధికారంలోకి వస్తే పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నాను.

-అన్నాజీరావు, తంపరరైతు, సత్రవుపేట, పోలాకి మండలం

వర్షాలు కురవకముందే విస్తరించాలి..

వర్షాలు కురవకముందే తంపర వంశధార కాలువలను విస్తరించాలి. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. తంపర రైతులు ఏటా వరి పంట నీటిలో మునిగి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎందరో అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించినా శాశ్వత పరిష్కారం రావడం లేదు. సీఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. టీడీపీ హయాంలో నిధులు మంజూరయ్యాయి. వైసీపీ పనులు చేపట్టలేదు.

-భూషణరావు, మాజీ సర్పంచ్, సుసరాం, పోలాకి మండలం